## ఆడంబరంగా అంజన్నకు 'ఆకుపూజ'



యాదగిరిగుట్ట : తెలంగాణ తిరుమలగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి ఆకుపూజను అర్చకులు ఆడంబరంగా నిర్వహించారు. మంగళవారం కొండపైన విష్ణుపుష్కరిణి పక్కన ఉన్న హనుమాన్ టెంపుల్ లో ఆంజనేయుడి మూలవిరాట్ కు తమలపాకులతో 'నాగవల్లి దళార్చన' పూజలు నిర్వహించారు. మొదట స్వామివారి మూలవిరాట్ ను ప్రత్యేక జలంతో శుద్ధి చేసి మన్యసూక్త పారాయణాలతో అభిషేకం చేశారు. సింధూరంతో పాటు పలు రకాల సుగంధం వెదజల్లే ద్రవ్యాలు, పూల మాలలతో ఆంజనేయస్వామిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి నాగవల్లి దళాలతో అర్చనలు నిర్వహించారు. ప్రత్యేకంగా తెప్పించిన తమలపాకులతో స్వామివారిని అర్చించారు. అనంతరం హనుమంతుడికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటిపండ్లను నైవేద్యంగా సమర్పించి భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. మరోవైపు ఆలయంలో నారసింహుడికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలై రాత్రి పవళింపుసేవతో ముగిశాయి. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా మంగళవారం ఆలయానికి రూ.16,17,555 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

## ఇందిరమ్మ ఇండ్లతో పేదోడి కలను కాంగ్రెస్ సాకారం చేసింది

**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**యాదగిరిగుట్ట :** రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ పార్టీ డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో పేదప్రజలను ముంచితే.. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇండ్లు కట్టించి పేదోడి కల సాకారం చేసిందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. మోటకొండూర్ మండలం కాటేపల్లి, ముత్తిరెడ్డిగూడెం, చాడ, చామాపూర్, తేర్యాల, పెద్దబావి, చాకంపల్లి, అమ్మనబోలు, ఇక్కుర్తిలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కదిరేణిగూడెంలో శ్యామల లక్ష్మీ, అశోక్ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకుని గృహప్రవేశం చేసుకున్న లక్ష్మీ, అశోక్ దంపతులకు యాటపోతు, పట్టుబట్టలు పెట్టి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ని ఇబ్బందులు ఉన్నా సొంతిల్లు కట్టుకోవాలనేది సగటు మనిషి కోరిక అని, కానీ ఆర్థిక స్తోమత లేక కల నెరవేర్చుకోలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుతో కాంగ్రెస్ పార్టీ సాకారం చేసిందని పేర్కొన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తామని పదేళ్లు సాగదీసిన బీఆర్ఎస్ సర్కార్.. కనీసం ఒక్కరికి కూడా డబుల్ బెడ్రూం ఇండ్లను కట్టించలేదని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి కేసీఆర్ ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుంటే.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే సీఎం రేవంత్ రెడ్డి రేషన్ కార్డులు ఇచ్చి పేదల పట్ల ఉన్న తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని తెలిపారు. పేదోడి కలలను ఒక్కొక్కటిగా సాకారం చేసుకుంటూ వెళుతున్నామని, అందులో భాగంగానే ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల పంపిణీ, ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. పేదోళ్లను బీఆర్ఎస్ ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేస్తే.. అదే పేదల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కంకణం కట్టుకుని పని చేస్తూ సుపరిపాలన అందిస్తోందన్నారు. పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ పార్టీకి.. రానున్న రోజుల్లో ప్రజలు అండదండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఐనాల చైతన్యా మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, మోహన్ రెడ్డి, ఆయా గ్రామాల గ్రామశాఖ అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

## స్థానిక ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు గెలిపించాలి

**బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు**

యాదగిరిగుట్ట : త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదాద్రి జిల్లాలో బీజేపీ అధిక స్థానాలు గెలిచేలా పని చేయాలని క్యాడర్ కు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. యాదగిరిగుట్టలో మంగళవారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల బీజేపీ కార్యశాల మీటింగ్ లో ఆయన చీఫ్ గెస్ట్ గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమబాట పట్టాలని సూచించారు. పార్టీ బలపర్చే అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి మండల కేంద్రంలో వర్క్ షాప్ నిర్వహించాలన్నారు. పార్టీ ఇచ్చే కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలపడితేనే మంచి ఫలితాలు సాధించగలుగుతామని, అందుకే కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించి మద్దతు కూడగట్టాలని సూచించారు.

# ఈటెలకు రాజకీయ బిక్ష పెట్టింది కేసీఆరే

**కెసిఆర్‌ని విమర్శిస్తే సహించేది లేదు**

**ఈటెల బీసీలకు చేసిందేమీ లేదు**

**ఈటెలపై కౌశిక్ నిప్పులు**



(కోరెం సుధాకర్ రెడ్డి జనతా న్యూస్ హుజరాబాద్)

మల్కాజ్గిరి ఎంపీ, బిజెపి నేత ఈటెల రాజేందర్ తనను తాను ఎక్కువగాఊహించుకుంటున్నారని, తన పార్టీ అధినేత కెసిఆర్ పై విమర్శలు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం హుజరాబాద్ పట్టణం కేసి క్యాంపులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2004 కంటే ముందు ఈటెల అంటే ఎవరికి తెలియదని.. ఆయనకు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చి ఎమ్మెల్యేను మంత్రిని జిల్లా పార్టీ అధ్యక్షుడిని చేసింది ఆయనకు రాజకీయ బిక్ష పెట్టింది కెసిఆరే నని అన్నారు. కెసిఆర్ ఆయనకు ఎన్నో అవకాశాలు ఇచ్చారని కానీ దళితుల భూములు అక్రమంగా ఆక్రమించారని, కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని కౌశిక్ ఆరోపించారు. చివరకు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు కుట్ర చేశారని అందుకే ఆయనను పార్టీ నుండి వెళ్లగొట్టారని అన్నారు. కెసిఆర్ అన్న పెడితే ఈటెల సున్నం పెట్టేందుకు ప్రయత్నించారని దుయ్యబడ్డారు. తను ఎమ్మెల్యేగా చేశానని మంత్రిగా చేశానని జిల్లా అధ్యక్షునిగా ప్రతి గ్రామంలో అడుగుపెట్టానని ఈటల చెప్పుకుంటున్నారని, ఆయన రాజకీయ ఎదుగుదలకు కేసీఆర్ కారణం కదా? అని ప్రశ్నించారు. తాను బీసీ నేతనని ఇతర చెప్పుకుంటున్నారని, బీసీలకు ఆయన చేసింది ఏమీ లేదని విమర్శించారు. తన కుమారుడికి కుమార్తెకు మనమడికి ముదిరాజ్ అని ఈటెల పెట్టుకోలేదని, రెడ్డి అని పెట్టుకున్నాడని గుర్తు చేశారు. కమలాపూర్ కు చెందిన తన బంధువులు ఈటెల ఇంట్లో ఎప్పుడైనా భోజనం చేశారా? అని ప్రశ్నించారు. బిజెపిలో నాయకుల మధ్యలో విభేదాలు ఉన్నాయి.. వాళ్లు వాళ్లు ఏమైనా ఆరోపించుకోవచ్చు.. కానీ కెసిఆర్ను విమర్శిస్తే సహించేది లేదు అని ఆయన అన్నారు. ఈటల ఉప ఎన్నికల్లో ఎన్నో అబద్ధాలు ప్రచారం చేసి గెలిచారని, కానీ ఆయన నిజ స్వరూపాన్ని ప్రజలు తెలుసుకొని 2023 ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించారని గుర్తు చేశారు. ఆయనకు ఇక్కడ ఏమీ లేదని, ప్రజలు ఆయనను మరిచిపోయారని అన్నారు. బీసీల కోసం ఒక్క కమ్యూనిటీ హాలైన ఈటల కట్టించారా? అని ప్రశ్నించారు. ఐదు ఎకరాల భవంతిలో ఈటల నివసిస్తున్నారని, కోడిగుడ్లు అమ్ముకున్న ఆయన.. నేడు బంగారు గుడ్లు విక్రయిస్తున్నారని ఎద్దేవా చేశారు. తాను అధికారిక కార్యక్రమాల్లో బండి సంజయ్ తో కలిసి పాల్గొన్నానని, తాను ఎమ్మెల్సీగా ఉండగా అహంకారంతో ఏనాడో ఈటెల ఒక్క అధికారిక కార్యక్రమానికి కూడా హాజరు కాలేదని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం కపంపల్లి సత్యనారాయణ లో కూడా బండి సంజయ్ తో కలిసి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు అని గుర్తు చేశారు. ఇటీవల ఈటెల కాంగ్రెస్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి ఒక కార్యక్రమంలో పాల్గొన్నారని ఆయన చేస్తే సంసారం వేరే వాళ్ళు చేస్తే వ్యభిచారం అవుతుందా అని కౌశిక్ మండిపడ్డారు. తన ఆస్తులను భూములను కాపాడుకునేందుకే నాడు ఈటల బిజెపిలోకి వెళ్ళాడు తప్ప ఆయనకు బిజెపిపై ఎలాంటి ప్రేమ లేదన్నారు. ఈటెల బండి సంజయ్ ట్రాప్ లో పడిపోయారని ఆయన చమత్కరించారు. ఈటెల నాడు టిఆర్ఎస్ పార్టీలోకి 2004 ఎన్నికలకు ఆరు నెలల ముందు మాత్రమే వచ్చారని, అంతకుముందే తన తండ్రి పాడి సాయినాథరెడ్డి కెప్టెన్ లక్ష్మీకాంతరావుతో కలిసి ఈ ప్రాంతంలో పార్టీని బలోపేతం చేశారని గుర్తు చేశారు. ఈటెల ఇక్కడ అడుగుపెట్టకముందే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను నాడు టిఆర్ఎస్ గెలుచుకుందని గుర్తు చేశారు. హుజరాబాద్ ప్రజలు చాలాసార్లు ఓట్లు వేసి గెలిపిస్తే ఈటల మాత్రం తనది శామీర్పేట అడ్డా అని అంటున్నారని విమర్శించారు. ఈటలను హుజురాబాద్, గజ్వేల్ ప్రజలు తిరస్కరించారని, ప్రస్తుతం మల్కాజిగిరి ప్రజలు కూడా తిరస్కరిస్తున్నారని అన్నారు. గతంలో కానీ ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు ఈటెలను అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించిన ఏనాడూ రాలేదని ఆయన అహంకారం ఎక్కువ అని కౌశిక్ అన్నారు. ఇటీవల గ్రామానికి 25వేల రూపాయలు ఇచ్చి తన కార్యకర్తలను శామీర్పేటకు రప్పించుకున్నారని, అయినప్పటికీ పట్టుమని 200 మంది కూడా అక్కడికి వెళ్లలేదని ఆరోపించారు. నాడు ఈటలతో బిజెపిలోకి వెళ్లినవారు తిరిగి గులాబీ పార్టీలోకి రావచ్చు అని, వారికి అన్ని రకాలుగా అండగా ఉంటానని వారికి ద్వారాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నానని కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు.

**ఎన్నికల హామీలు అమలు చేయండి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. గతంలో తాను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు కెసిఆర్ ఎంతో ప్రేమతో హుజురాబాద్కు అనేక అభివృద్ధి కార్యక్రమాలు మంజూరు చేశారని గుర్తు చేశారు. అప్పటి అభివృద్ధి కార్యక్రమాల నిధులన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని, వెంటనే వాటిని తిరిగి మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఇప్పటివరకు ఒక్క పైసా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదని అన్నారు. తనకు వచ్చే నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా ఇవ్వడంలేదని మండిపడ్డారు. నా పైన కోపం ఉంటే తీర్చుకోండి కానీ ప్రజలపై మాత్రం కోపం చూపెట్టొద్దు అని ఆయన అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలను బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంటుందని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, గందె శ్రీనివాస్, కలిపాక శ్రీనివాస్, కొండల్ రెడ్డి, డాక్టర్ ఐలయ్య, కల్లేపల్లి రమాదేవి, ముక్క రమేష్, ఇమ్రాన్, తులసీదాస్, ఆర్కే రమేష్, అజ్మతుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పతాకావిష్కరణ దినోత్సవం

జనత న్యూస్ బెజ్జంకి :జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని చిలాపూర్ లోని ప్రాథమికోన్నత పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులచే గ్రామంలోని ప్రధాన వీధుల గుండ ర్యాలీ నిర్వహించి పథకావిష్కరణ దినోత్సవాన్ని ప్రజలకు గుర్తు చేయడం జరిగింది. అనంతరం పాఠశాలలో జరిగిన సమావేశంలో లయన్స్ క్లబ్ జోనల్ చైర్పర్సన్ వై రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ పతాకాన్ని రఘుపతి వెంకయ్య రూపొందించగా దానిని ఆవిష్కరించిన రోజు ఇది అని అన్నారు. జాతీయ పతాకం రూపకల్పన, దానిపై చర్చ, దాని ప్రాముఖ్యత, గౌరవం, దాని పట్ల ప్రజలు చూపిస్తున్న దేశభక్తి తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎర్రవెల్లి శ్రీనివాస్ పవ్వాడి మల్లికార్జున్ హరీష్ శరత్ పాఠశాల అధ్యాపక బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## కల్లూరు మోడల్ స్కూల్ ను సందర్శించిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



కోరుట్ల,జనతా న్యూస్: కోరుట్ల మండలం కల్లూరు గ్రామంలో మోడల్ స్కూల్ ను కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల డాక్టర్ సంజయ్ సందర్శించి వివిధ సమస్యలపై ఆరా తీశారు. సంబంధిత సమస్యలపై అధికారులతో మాట్లాడారు. అలాగే స్కూల్ లో విద్యార్థిని విద్యార్థుల.బాగోగులు వారిని అడిగి స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం స్కూల్ లో డిజిటల్ పాఠశాల తీరును విద్యార్థులతో కలిసి పాఠాలను విన్నారు. పాఠశాలకు ఒక బస్ నడుస్తుందని విద్యార్థినులను వివరించిగా ఆర్టీసి డిపో మేనేజర్ తో మాట్లాడి పాఠశాల టైమింగ్స్ ని బట్టి ఇంకో బస్ నడపాలని కోరారు. స్కూల్ లో ఎలక్ట్రిసిటీ సమస్య ఉన్నందువల్ల ఎలక్ట్రిసిటీ ఏడి తో మాట్లాడరు. హాస్టల్ లో వాటర్ టాయిలెట్స్ సమస్య ఉన్నదని వివరించిగా స్పెషల్ ఆఫీసర్ రజిత తో మాట్లాడి ఇట్టి సమస్యను త్వరితగతన పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యే తో పాటు కోరుట్ల మండల బీఆర్ఏస్ అధ్యక్షులు దారిశెట్టి రాజేష్ , మాజీ సర్పంచ్ అంజయ్య ,మాజీ ఉపసర్పంచ్ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

